సాక్షి ఒడిశా

శనివారం । 14 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5.32.741

బంగారం 20 గ్రాముల 550 మిల్లీ గ్రాములు

వెండి 745 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రైల్వే స్థలాలను ఖాళీ చేయాలి

రాయగడ పట్టణంలోని రైల్వేస్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉన్నవారంతా తప్పనిసరిగా ఆయా స్థలాలను ఖాళీ చేయాలని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ స్పష్టం చేశారు.

-10లో

అయ్యో...!



భర్త ఆత్మహత్య చేసుకున్న కొద్ది గంటల్లోనే భార్య ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన జయపురం పంచానన మందిర ప్రాంతంలో చోటుచేసుకుంది.

-10లో

న్యూస్‌రీల్

అస్వస్థతతో విద్యార్థిని మృతి



విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పుటాసింగి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. మృతురాలు లీనాభుయ్యాగా గుర్తించారు. పాఠశాల హెచ్‌ఎం తెలిపిన వివరాల మేరకు.. రెండు రోజులుగా లీనా జ్వరంతో బాధపడడంతో వైద్యులను సంప్రదించి చికిత్స అందజేశామని తెలిపారు. అయితే గురువారం రాత్రి విద్యార్థిని ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో గుణుపూర్ ఆస్పత్రికి తరలించామన్నారు. అయితే అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ఘటనపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శాంతి ప్రభా ప్రధాన్ మాట్లాడుతూ.. తాను ఆశ్రమ పాఠశాలను సందర్శించి, అక్కడ సిబ్బందితో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన పేకాటరాయుళ్లు

బరంపురం: గంజాం జిల్లాలోని జరడా పోలీసులు కొద్ది రోజులుగా రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బాబునంద ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. జరడా పోలీసుస్టేషన్ పరిధి కుంబారి వీధిలోని ఒక ఇంటిలో రహస్యంగా జూదం అడ్డా నడుస్తోంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం దాడిచేసి ఆరుగురుని అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.53,100 నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 పేక కట్టలు స్వాధీనం చేసుకున్నారు.

భారీగా గంజాయి సీజ్



గంజాయి నిల్వ ఉంచిన గోదాముపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలో రోజురోజుకీ గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. పట్టపూర్ బ్లాక్ గంజాం–గజపతి జిల్లాల సరిహద్దు తప్తపాణి దగ్గర 59వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో గంజాయి నిల్వ ఉంచిన గోదాముపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడిచేసి సుమారు రూ.కోటి విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన తెలిపిన వివరాల మేరకు.. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ అశిష్ కుమార్ సింగ్ ఆదేశాలతో కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఇచ్చిన సమాచారంతో గంజాయి నిల్వ ఉంచిన గోదాముపై పోలీసులు దాడులు చేసి రూ.కోటి విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పట్టపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట 21 కిలోలు...

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 56 గ్రామం వద్ద గురువారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై రావడం గమనించి బండి ఆపి తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక బస్తాలో గంజాయిని స్వాధీనం చేసుకొని, నిరుప్‌జిత్ అనే వ్యక్తికి అరెస్టు చేశారు. శుక్రవారం అతడిని కలిమెల పోలీసుస్టేషన్‌లో విచారించగా గంజాయిని భద్రాచలం తరలిస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. గంజాయి తూకం వేయగా 21 కిలోలు ఉంది. దీని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పూరీ నుంచి బరిలోకి..?

- రానున్న ఎన్నికల్లో సీఎం పోటీ స్థానంపై పుకార్లు
- ఈసారి స్థానం మారనున్నట్లు ప్రచారం
- ఎక్కడ పోటీ చేసినా గెలుపు ఖాయం: బీజేడీ వర్గాలు





సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పూరీ నుంచి పోటీ చేస్తారని పలు వర్గాల నుంచి ప్రచారం ఊపందుకుంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈసారి కొత్త నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశాలపై పలు వర్గాల్లో చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో పూరీ శాసనసభ స్థానం బీజేడీ చేజార్చుకుంది. ఈ వ్యవధిలో ఈ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఉనికిని బలపరచుకుంది. ఈ పరిస్థితుల్లో బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పూరీ నియోజకవర్గం నుంచి సత్తా చాటుకోవాలనే సవాళ్లు తలెత్తాయి. ఈ చర్చ రాజకీయ శిబిరాల్లో వాడివేడిగా సాగుతోంది. పూరీ నుంచి నవీన్ రంగంలోకి దిగితే బీజేపీ, బీజేడీ మధ్య హోరాహోరీ పోటీ శాసనసభ ఎన్నికల ఘట్టాన్ని రక్తి కట్టిస్తుంది.

ఆయనదే తుది నిర్ణయం

ఏ స్థానం నుంచి పోటీ చేయాలనేది బీజేడీ అధ్యక్షుడిగా నవీన్ పట్నాయక్‌దే తుది నిర్ణయం. అయితే చిట్ట చివరి క్షణం వరకు కీలక నిర్ణయాలను బయటకు పొక్కనీయకుండా ఆయన అత్యంత జాగ్రత్త ప్రదర్శిస్తారు. ఈసారి ముందస్తుగా ఆయన వార్తల్లోకి ఎక్కడం విశేషం. సాధారణంగా బహిరంగ చర్చలు, వ్యాఖ్యలు వగైరా వ్యవహారాల్లో నవీన్ ప్రస్తావన శూన్యం. ఆయనకు అత్యంత సన్నిహితంగా మెసలుతున్న 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్ విహంగ పర్యటనల దుమారంతో ముఖ్యమంత్రి హోదాలో ప్రత్యక్షంగా హాజరై సభలో వివరణ ఇవ్వాల్సి వచ్చింది. వివాదాలకు దూరంగా ఉంటూ హుందాతనానికి మారుపేరుగా సుపరిచిత నవీన్ పట్నాయక్ ఇలా సభలో వివరణ ఇవ్వడం ప్రముఖుల దృష్టిని ఆకట్టుకుంది.

వ్యూహాత్మక శైలి


ముందస్తు ఎన్నికలపై చెలరేగిన దుమారం మీద పెదవి కదపని ముఖ్యమంత్రి పలు ప్రజాకర్షిత పథకాలను శరవేగంగా ప్రవేశపెట్టి విపక్షాలకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునే దిశలో పలు పథకాలను చకచకా ప్రవేశ పెడుతున్నారు. మిషన్ శక్తి ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికలు–2024 మిషన్ విజయ బాటలో దూసుకుపోవడం తథ్యమనే సంకేతాలు బలపడుతున్నాయి. పూరీ ప్రాంతంలో ఇటీవల బీజేడీ వ్యతిరేక పవనాలు బలం పుంజుకుంటున్నాయి. ఈ పరిస్థితి విపత్తుగా పరిణమించక ముందే జాగ్రత్త వహించే దిశలో నవీన్ పట్నాయక్ అభ్యర్థిత్వాన్ని తెరపైకి తేవడం రాజకీయ వ్యూహంగా స్పష్టం అవుతుంది. పూరీ శ్రీజగన్నాథ మందిరం ప్రాకార ప్రాజెక్టు మొదలుకొని పలు పథకాలు, ప్రాజెక్టుల కార్యాచరణ తీవ్ర కలకలం రేపాయి. ఈ వివాదాలు నేటికీ చాప కింద నీరులా మరుగున పొంచి ఉన్నాయి. పూరీ నుంచి పోటీ చేయాలని ముఖ్యమంత్రికి పలు వర్గాలు అభ్యర్థిస్తున్నాయి. ప్రజారణతో శ్రీజగన్నాథుని ఆశీస్సులు తమ నాయకునికి అండగా నిలిపి ప్రతిష్టాత్మకంగా గెలిపిస్తాయని బీజేడీ శిబిరాల్లో చర్చ నడుస్తోంది. పూరీ నుంచి పోటీ ఊహాగానాలు వాస్తవ రూపం దాల్చితే సొంత పార్టీ శ్రేణులకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బలమైన మద్దతుతో భారీ ఆధిక్యతతో గెలిపిస్తారని శ్రీజగన్నాథుని సీనియర్ సేవాయత్ రామకృష్ణ దాస్ మహాపాత్రో ఇటీవల ఒక సందర్భంలో పేర్కొన్నారు. ఈ ప్రకటన నవీన్ పట్నాయక్ పూరీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం తథ్యం అనే సంకేతాలు పంపిస్తోంది.

విజయం తథ్యం

ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు ఎక్కడి నుంచి పోటీ చేసినా విజయం తథ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు శశి భూషణ్ బెహరా శుక్రవారం అన్నారు. నవీన్ నాయకత్వంపై రాష్ట్ర ప్రజల్లో మక్కువ బలపడింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆదరాభిమానాలు ఆయనను తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఆయన ఏ స్థానం నుంచి పోటీ చేసినా ప్రజలు విజయ కిరీటంతో పట్టం గడతారని పేర్కొన్నారు. రాష్ట్ర బహుముఖ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలు విశేష గుర్తింపు సాధించాయన్నారు. ఆయన నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ పాలన విశేష ప్రజాదరణ చూరగొంది. నవీన్ సుదీర్ఘ సుస్థిర పాలన ప్రజల్లో చెక్కు చెదరని నమ్మకానికి పీఠం వేసింది. ఏటా ఆయన ప్రజాదరణ బలపడుతునే ఉందని బీజేడీ వర్గాలు ధీమా వ్యక్తం చేయడం విశేషం.

• రుతుపవనాలు నిష్క్రమణ

రాష్ట్రం నుంచి నైరుతి రుతు పవనాలు నిష్క్రమించాయి. ఈనెల 13వ తేదీ శుక్రవారం నుంచి రుతు పవనాలు పూర్తిగా రాష్ట్రం నుంచి తరలిపోయినట్లు భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) ప్రకటించింది. నైరుతి రుతుపవనాల ఉపసంహరణ రేఖ ఫర్‌బేజ్‌గంజ్, మాల్డా, 24.0 డిగ్రీలు ఉత్తరం/89.0 డిగ్రీలు తూర్పు, విశాఖపట్నం, నల్గొండ, రాయచూర్, వెంగఉర్ల మరియు 16 డిగ్రీలు ఉత్తరం/70.0 డిగ్రీల తూర్పు వైపు వెళ్తుందని స్థానిక వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.ఆర్.బిశ్వాస్ తెలిపారు. – భువనేశ్వర్



తప్పుడు అఫిడవిట్ కేసులో జరిమానా

భువనేశ్వర్: తప్పుడు అఫిడవిట్ కేసు విచారణ పురస్కరించుకుని కోర్టుకు గైర్హాజరు కావడంతో నిందిత ఎమ్మెల్యేకి రాష్ట్ర హైకోర్టు జరిమానా విధించింది. బరాబటి – కటక్ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీంకు హైకోర్టు ఈ ఆదేశాలు శుక్రవారం జారీ చేసింది. కేసు తదుపరి విచారణ ఈనెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. గత ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయనకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టులో కేసు దాఖలైంది. ఈ కేసులో వాంగ్మూలానికి హాజరు కావాలని న్యాయస్థానం ఆయనకు ఆదేశించింది. ఈ మేరకు మరింత సమయం కావాలని అభ్యర్థించడంతో హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసి, మహ్మద్ మొకీంకు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ మొత్తం న్యాయవాదుల సంక్షేమ నిధిలో జమ చేయాలని ఆదేశించింది.

వాస్తవాలు బహిరంగపరచలేదు

ఎన్నికల్లో పోటీ పురస్కరించుకుని నామినేషన్ పత్రాలతో దాఖలు చేసిన అనుబంధ దస్తావేజుల్లో తనకు వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులకు సంబంధించి వాస్తవాలను ఎమ్మెల్యే బహిరంగపరచలేదు. ఈ చర్య ఎన్నికల నిబంధన ఉల్లంఘన అని, ఈ మేరకు చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేయాలని బిజూ జనతాదళ్ నాయకుడు దేబాశిష్ సామంతరాయ్ హైకోర్టుకు అభ్యర్థించారు. ఈ పరిస్థితుల్లో మహ్మద్ మొకీం ఎన్నికను సవాలు చేస్తూ 2019 సంవత్సరం జూలై 3న పిటిషన్ దాఖలు చేశారు. మొకీం ఆస్తులు, అప్పుల వివరాలకు సంబంధించి వాస్తవాలను వెల్లడించలేదని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

గంగాధర నందో ఇకలేరు

జయపురం: ప్రముఖ సాహితీవేత్త, ఆదివాసీ పరిశోధకుడు, ప్రజ్ఞా భారతి వ్యవస్థాపకుడు డాక్టర్ గంగాధర నందో (73) ఇకలేరు. గురువారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో జయపురంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆయన హిందూ సమాజ్ వాదిగా ప్రాచీన హిందూ సాంప్రదాయాలు పరిరక్షించేందుకు ప్రజ్ఞాభారతి సంస్థను స్థాపించి సాంప్రదాయాలపై వివిధ పోటీలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు అందజేసేవారు. అంతేకాకుండా కొరాపుట్ జిల్లాలో పలు రంగాల్లో ప్రజలకు సేవలు చేసినవారిని సన్మానించేవారు. ఆయన పార్థివదేహాన్ని విశాఖపట్నం నుంచి జయపురం ప్రజ్ఞాభారతి కార్యాలయానికి శుక్రవారం తీసుకొచ్చారు. దీంతో ఆయనను కడసారి చూసేందుకు వందలాదిమంది ప్రజలు వచ్చారు. జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.



గంగాధర నందో మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు



సౌదామిని రథ్ (ఫైల్)



దర్యాప్తు చేస్తున్న టౌన్ పోలీసులు

బరంపురం: రెండు రోజుల క్రితం జరిగిన సీడబ్ల్యూసీ మెంబర్ సౌదామిని రథ్ హత్య కేసులో సంబంధిత డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఎస్‌డీపీవో తెలిపిన వివరాల మేరకు.. గుసానినువాగం పోలీసుస్టేషన్ పరిధి గుసానినువాగం, నీలకంఠనగర్‌లో నివాసముంటున్న సీడబ్ల్యూసీ మెంబర్ సౌదామిని రథ్ హత్య జరిగింది. సమాచారం అందుకున్న పోలీసుల బృందం సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎంకేసీజీ మెడికల్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో సింహాచలం సాహు మరియు అతని సహచరుడు బిశ్వనాథ్ సాహులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు



రేస్‌లో పాల్గొనేందుకు వచ్చిన యువతీ, యువకులు

అదిరెన్..!



ఫాగ్ ఎయిర్‌తో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు

- ఆదివాసీ యువతకు మారథాన్
- సత్తాచాటిన యువతీ, యువకులు



జెండా ఊపి రేస్ ప్రారంభిస్తున్న మంత్రి సరక తదితరులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఆదిరన్ పేరిట ఆదివాసీ, హరిజన యువతకు స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మారథాన్ రేస్ నిర్వహించారు. మంత్రి సరక ముందుగా జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 3,245 మంది ఆదివాసీ, హరిజన యువతీ, యువకులు ఈ రేస్‌లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానం నుంచి ప్రారంభమైన రేస్‌లో పాల్గొన్న యువత మజ్జిగౌరి మందిరం మీదుగా రింగ్‌రోడ్, ఎఫ్‌సీఐ గోడౌన్, మెయిన్ మార్కెట్ మీదుగా తిరిగి మైదానంకు చేరుకున్నారు. అత్యంత ఉత్సాహంగా కొనసాగిన రేస్‌లో నిర్వాహకులు తాగునీరు, గ్లూకోజ్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బిజు స్వస్థ్య సమితి ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, అన్వేష సంస్థ రాష్ట్ర శాఖ సలహాదారులు అలీనా దాస్, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, పృథ్వీరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునే బహుమతులు

ఆదిరన్ పేరిట నిర్వహించే ఈ మారథాన్ రేస్ పోటీల్లో విజయం సాధించినవారికి ఆకట్టుకునే బహుమతులు ఏర్పాటు చేశామని మాఝి వివరించారు. యువతుల విభాగంలో ప్రథమ బహుమతి ఎలక్ట్రానిక్ స్కూటీ, అదేవిధంగా యువకుల విభాగంలో ప్రథమ బహుమతి మరో ఎలక్ట్రానిక్ స్కూటీతో పాటు ద్వితీయ బహుమతులుగా రెండు విభాగాలకు గాను బ్యాటరీతో నడిచే సైకిళ్లను, మిగతా వారికి ఆకట్టుకునే ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విజేతలు వీరే

మారథాన్ రేస్‌లో భాగంగా యువతుల విభాగంలో ప్రథమ బహుమతిని కాసీపూర్‌కు చెందిన నీలేంద్రి మాఝి స్వాధీనం చేసుకోగా, ద్వితీయ బహుమతి బినొదిని బిడిక, తృతీయ బహుమతిని మాలతీ మాఝిలు గెలిపొందారు. అదేవిధంగా ప్రోత్సాహక బహుమతులను సంతోషి హిమిరిక, సుకాంతి తిమక, రహంతి సరక, మనీషా మండల్, పంచాలి సెనా, రేవతి పిడిసిక, రోజీ ప్రస్కాలు దక్కించుకున్నారు. అలాగే యువకుల విభాగంలో ప్రథమ బహుమతి రాయగడకు చెందిన బిడిక సిద్ధు గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని నేత్రమణి సబర్, తృతీయ బహుమతిని ఈశ్వర్ హికకలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా ప్రోత్సాహక బహుమతులను ఛొకిట జొడియా, శ్రీకాంత్ ప్రస్కా, రాజాన ధోని, కొల్లి ప్రస్కా, రాహుల్ కొరకొరియా, రాఘవ కొలక, టంకాధర్ నాయక్‌లు దక్కించుకున్నారు.

సంస్కృతిని పరిరక్షించడమే లక్ష్యం

ఆదివాసీ భాష, కళలు, సంస్కృతిని పరిరక్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 23 జిల్లాల్లో ఎస్‌డీసీ సంస్థను ఏర్పాటు చేసిందని ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఇటువంటి తరహా క్రీడలు ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలియజేశారు. ఆదిరన్ పేరిట నిర్వహించిన ఈ మారథాన్ రేస్‌లో అధిక సంఖ్యలో యువత ఆసక్తిగా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ఎలీనా దాస్, మాఝిల నృత్య విన్యాసాలు



ప్రథమ బహుమతులు గెలుచుకున్న సిద్ధు, బినొదిని బిడికలు



ధింసా నృత్యం చేస్తున్న ఆదివాసీ యువతిలు



దంగడా, దంగిడి నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

ఝార్సుగుడ నుంచి ప్రత్యక్ష విమాన సేవలు

భువనేశ్వర్: ఇండిగో ఝార్సుగుడ వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి కోల్‌కతా మరియు బెంగళూరుకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది నవంబర్ 5న కోల్‌కతా మరియు నవంబర్ 15న బెంగళూరుకు ప్రత్యక్ష విమానయాన సేవలు ప్రారంభించనున్నట్లు ఝార్సుగుడ విమానాశ్రయ అధికార వర్గాలు తెలిపాయి.

2019 సంవత్సరం ఏప్రిల్ నెలలో ఝార్సుగుడ వీర్ సురేంద్ర సాయి (వీఎస్‌ఎస్) విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు ప్రారంభించారు. పారిశ్రామిక కేంద్రంగా ఉన్న ఈ చిన్న విమానాశ్రయం నుంచి ప్రతి సంవత్సరం సగటున 2,00,000 మంది ప్రయాణికులు ప్రయాణించారు.

భూ సర్వేపై సమగ్ర వివరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం గురించి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ విశాఖ వేదికగా శుక్రవా రం జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రీ సర్వే లో అనుసరిస్తున్న విధివిధానాల గురించి తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన దగ్గర నుంచి ఆటో మ్యుటేషన్ ప్రక్రియ, ఎల్.పి.ఎం.(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నంబర్ కేటాయింపు వరకు జరుగుతున్న ప్రక్రియ గురించి విపులంగా వివరించారు. గ్రౌండ్ ట్రూథింగ్, వెక్టరైజేషన్ ప్రక్రియ గురించి తెలుపుతూ రైతుల సమక్షంలో సరిహద్దులను నిర్ణయించి రీ సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మహిళ బ్యాగులో నగదు చోరీ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం యూనియన్ బ్యాంక్ వద్ద ఓ పొదుపు సంఘం సభ్యురాలి బ్యాగులో ఉన్న రూ.లక్ష నగదును ఇద్దరు మహిళలు దొంగిలించారు. జేఆర్ పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాధితురాలు బాలత్రిపుర సుందరిదేవి పైడిభీమవరం యూనియన్ బ్యాంక్‌లో పొదుపు సంఘ సభ్యురా లు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్ నుంచి నగదు ను విత్‌డ్రా చేశారు. తర్వాత పన్నెండు మంది సభ్యు లు బ్యాంక్ పక్క సందులో మెట్లు వద్ద కూర్చుని డ బ్బులు పంచుకున్నారు. బాధితురాలు త్రిపుర సుందరిదేవి తన రూ.లక్ష నగదును హ్యాండ్ బ్యాంగ్‌లో పెట్టుకుని సభ్యులతో మాట్లాడుతూ ఉన్నారు. కాసేపయ్యాక ఇంటికి వెళ్లిపోదామని బ్యాగ్ చూస్తే అందులో డబ్బులు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. మరో మహిళ బ్యాగ్ కూ డా చిరిగిపోయి అందులో పేపర్లు చిరిగిపోయాయి. కానీ అందులో డబ్బులు పోలేదు. అప్పటి వరకు ఎ వరో ఇద్దరు మహిళలు అక్కడే తిరిగారని, వాళ్లే బ్యా గులు కోసేసి నగదు కాజేసి ఉంటారని అనుమానించారు. బ్యాంకు సీసీ కెమెరాలో చూస్తే ఏమీ కనిపించలేదు. శుక్రవారం ఉదయం బాధితురాలు గ్రామపెద్దల సహకారంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యా దు చేశారు. దీంతో వారు పైడిభీమవరం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. ఒక చిన్న పిల్లాడితో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు ఆ సమయంలో సంచరించినట్లు కెమెరాల్లో రికార్డైంది. వారి ని పాత నేరస్తులుగా గుర్తించారు. బాధితురాలి ఫి ర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమరవీరులను సమాజం మర్చిపోదు



మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరరావు, ఏపీసీ జయప్రకాష్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతావని కోసం ప్రాణాలు అర్పించిన వీరులను సమాజం ఎన్నటికీ మర్చిపోదని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్.విజయకుమారి అధ్యక్షతన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా దేశభక్తితో మెలగాలని పిలుపునిచ్చా రు. సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మా ట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను గుర్తుచేసుకోవాలన్నారు. వివిధ మండలాలల నుంచి సేకరించిన మట్టిని అమృత కలశంలో సంగ్రహించి దేశ రాజధానికి పంపిస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు, వేషధారణలు

ఈ సందర్భంగా పాఠశాలలో దేశం కోసం ప్రాణాలర్పి ంచిన వీరుల స్మృతి కోసం జాతీయ పతాకావిష్కరణ, అనంతరం పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రాంగణంలో పచ్చదనాన్ని ప్రతిబింబించేలా మొక్కలు నాటా రు. మేరా మట్టి మేరా దేశ్‌లో భాగంగా విద్యార్థులు దేశనాయకుల వేషధారణతో ఆకట్టుకున్నారు. దేశభక్తి గేయాలను ఆలపించి నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జీజీహెచ్ స్కూల్ హెచ్‌ఎం ఎం.వాగ్దేవి, జీసీడీఓ నీరజ, ఏపీవో నళినీ కాంత్, పలువురు హెచ్‌ఎంలు, విశ్రాంత టీచర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్థలాలను ఖాళీ చేయాలి

- నిరాశ్రయులకు జాగా మిషన్ ద్వారా ఇళ్ల స్థలాలు
- కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ సింగ్, వేదికపై నెక్కంటి, పట్నాయక్ తదితరులు

రాయగడ: పట్టణంలోని రైల్వేస్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉన్నవారంతా తప్పనిసరిగా ఆయా స్థలాలను ఖాళీ చేయాలని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ స్పష్టం చేశారు. ఇళ్లు కోల్పోయిన నిరాశ్రయులకు మున్సిపాలిటీ పరిధిలో జాగా మిషన్–1 ఫేజ్‌లో భాగంగా బాధితులకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలతో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలియజేశారు. అందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, ఇకపై ఆయా పనులను ముమ్మరం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ మేరకు మున్సిపల్ సమావేశ మందిరంలో రైల్వేస్థలాల్లో ఉన్నవారితో జిల్లా యంత్రాంగం శుక్రవారం చర్చించింది. సుమారు గంట సమయం చర్చించిన అనంతరం కలెక్టర్ ఈ మేరకు వారికి నచ్చజెప్పారు. అందుకు వారంతా సుముఖత వ్యక్తం చేయడంతో చర్చలు ఫలించాయి. పట్టణంలో 872 ఇళ్లు రైల్వేస్థలంలో ఉన్నట్లు తమ సర్వేలో తేలిందని ఆమె వివరించారు. రైల్వే డివిజన్ ఏర్పాటులో భాగంగా ఆక్రమణలు తొలగించేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

నిరాశ్రయులను ఆదుకునేందుకు

రైల్వే స్థలాల్లో ఆక్రమణలు తొలగిస్తే నిరాశ్రయులను ఆదుకునే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం జాగా మిషన్–1 ఫేజ్‌లో బిజూ ఆదర్శ కాలనీ పేరిట ఇళ్ల స్థలాలను మంజూరు చేసేందుకు నిర్ణయించిందన్నారు. పట్టణంలోని చెక్కాగుడ, తుంబిగుడ, రామచంద్రపూర్, రాణిగుడ, రాయగడ ప్రాంతాల్లో సుమారు 29.90 ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఉందని వివరించారు. అందుకు సమ్మతమైతే రైల్వే స్థలాల్లో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. బిజూ జనతా దళ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు ఎంపీ నెక్కంటి భాస్కరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల పక్షానే ఉంటుందన్నారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు జాగా మిషన్ ద్వారా ఇళ్ల స్థలాలను కేటాయించి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. పట్టణం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే స్థలాలను తప్పనిసరిగా ఆక్రమణదారులు ఖాళీ చేయడం అనివార్యమని పేర్కొన్నారు. ఇదే విషయమై ప్రభుత్వంతో చర్చించిన అనంతరం ఇళ్లు కోల్పోయే నిరాశ్రయులకు విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సౌకర్యాలతో ఇళ్ల స్థలాను కేటాయిండంతో పాటు అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు, ఆవాస్ గృహాలను ప్రభుత్వం నిర్మించి ఇచ్చేందుకు కూడా వెనకాడదన్నారు. అందువల్ల సందేహాలు, అపోహాలను వీడి ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. సమావేశంలో సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవ్, తహసీల్దార్ ప్రియదర్శిని స్వాయి, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి యాసీన్ బిలాల్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, వైస్ చైర్మన్ శుభ్ర పండ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో..!



చంచల మఝి (ఫైల్)

జయపురం: భర్త ఆత్మహత్య చేసుకున్న కొద్ది గంటల్లోనే భార్య ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన జయపురం పంచానన మందిర ప్రాంతంలో చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 11వ తేదీన విజయ మఝి ఒక చెట్టుకు ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో భర్త ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన భార్య చంచల మఝి(30) కుంగిపోయింది. జగన్నాథ సాగర్ ప్రాంతం పంచానన మందిర కూడలి వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించి, ఆరోగ్యం కుదుటపడిన అనంతరం బముణిగాంలో నివాసముంటున్న కన్నవారింటికి తీసుకెళ్లారు. అయితే అక్కడ ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు ఆమెను జయపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఏడాది క్రితమే వీరి కుమార్తె సైతం మరణించింది.

చేపల ఉత్పత్తిలో 31.5 శాతం వృద్ధి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- జాతీయ స్థాయిలో రాష్ట్రానికి నాలుగో స్థానం

భువనేశ్వర్: చేపల ఉత్పత్తిలో ఒడిశా నాలుగో అతి పెద్ద రాష్ట్రంగా వృద్ధి చెందింది. జాతీయ స్థాయిలో సముద్ర చేపల ఉత్పత్తిలో ఏడో అతిపెద్ద రాష్ట్రంగా నిలిచింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారుడు అసిత్ త్రిపాఠి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మత్స్య, జంతు వనరుల అభివృద్ధి శాఖ సమీక్ష సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. చేపల విత్తనాల ఉత్పత్తిలో ఒడిశా స్వావలంబన సాధించింది. ఏటా 7.62 లక్షల టన్నుల చేపల ఉత్పత్తితో రాష్ట్రం వార్షిక వృద్ధి రేటు 31.5 శాతం సాధించిందని తెలిపారు. దేశంలో సముద్ర చేపల ఉత్పత్తిలో ఒడిశా ఏడో అతి పెద్ద రాష్ట్రంగా అవతరించి, చేపల ఎగుమతిలోనూ అగ్రగామిగా నిలిచినట్లు ఈ సమీక్ష సమావేశంలో వెల్లడి అయింది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి, విక్రయం, పంపిణీలో గణనీయమైన వృద్ధి నమోదైందని అసిత్ త్రిపాఠి తెలిపారు. సంబల్‌పూర్ జిల్లా హిరాకుడ్ జలాశయంలో రూ.100 కోట్లతో ఆక్వా కల్చర్ ఫారం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో చేపల ఉత్పత్తి సౌకర్యం, ప్రాసెసింగ్ యూనిట్ మరియు సాధారణ మౌలిక సదుపాయాలు ఉంటాయి. అంతేకాకుండా రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ఉప్పు నీటిలో చేపల పెంపకానికి ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. సమావేశంలో మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ వశిష్ఠ పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు

పొందూరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతున్న పొందూరు సీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జె.భాస్కరరావు తెలిపారు. పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆస్పత్రిలో విచారణ జరిపారు. 20 రోజుల కిందట జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన పాముకాటు బాధితునికి చికిత్స చేయకుండా శ్రీకాకుళం పంపించి వేయడంతో మార్గం మధ్యలోనే మృతి చెందాడని, ఎఫ్‌ఎన్‌ఓతో మరో రోగికి ఇంజెక్షన్ చేయించడం వల్ల నరాల సమస్య తలెత్తిందని పలు ఫిర్యాదు అందాయి. పాముకాటు బాధితుడి కుటుంబసభ్యులు డీసీహెచ్‌ఎస్‌కి, జిల్లా ఉన్నతాధికారులకు పొందూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌దాస్, సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం బాధితులతో చర్చించారు. వీటిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

‘ట్రాన్స్‌జెండర్లు ఉపాధి అన్వేషించాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: ట్రాన్స్‌జెండర్లు ఉపా ధి అవకాశాలు వెతుక్కోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినా యుడు అన్నారు. న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం జిల్లాలోని విద్యావంతులైన ట్రాన్స్‌జెండ ర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి మాట్లాడుతూ పట్టభద్రులైన ట్రాన్స్‌జెండర్లు ఉద్యోగాలను అన్వే షించి, సమాజంలో గౌరవంగా జీవించాలన్నా రు. చదువుకోని వారు చదువుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



సారవకోట: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి సమీపంలో శుక్రవారం ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. బుడితి నుంచి బద్రి వైపు వెళ్తు న్న కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం జేసీబీతో కారును పొలాల నుంచి బయటకు తీసుకొచ్చారు.

నౌపడ రైల్వేస్టేషన్ సందర్శన

టెక్కలి రూరల్: నౌపడ రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీ చేశారు. సీనియర్ అధికారులతో కలిసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో 3, 4వ లైన్ సామర్థ్యం పెంపుదల పని, అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ప్రయాణికుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా కోసం స్థలం పరిశీలించారు.

పథకాలు ప్రజలకు చేరువవ్వాలి

- ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: జిల్లాలో పనిచేస్తున్న సీఎస్‌వీ(కామన్ సర్వీసు సెంటర్), గ్రామీణ స్థాయి ఎంటర్‌ప్రైజర్స్ (వీఎల్‌ఈ)లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం, పీఎంజీవై, స్వస్థ్య కల్యాణ యోజన వంటి పథకాలు ప్రజలకు చేరువ చేయాలని ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు కోరారు. స్థానిక రోటరీ సామాజిక భవనంలో సీఎస్‌వీలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారుడు కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాశీనగర్ సమితి మాజీ అధ్యక్షుడు చిత్రి సింహాద్రి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కుమార్, ప్రశాంత్ పాలో, కౌన్సిలర్ బాలకృష్ణ పాత్రో, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, సాధారణ కార్యదర్శి ఈ.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మన జాగిలాల పనితీరు అ‘ద్వితీయం’

శ్రీకాకుళం క్రైమ్ :



బ్యూటీ, రాణీ జాగిలాలను నిమురుతున్న ఎస్పీ రాధిక

జిల్లా పోలీసు జాగిలం బ్యూటీకి రాష్ట్రస్థాయి శిక్షణలో ద్వితీయ స్థానం దక్కింది. మంగళగిరి ఆరో బెటాలియన్‌లో ఇంటిలిజెన్సు సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఎనిమిది నెలల పాటు జరిగిన కెన్నెల్ అండ్ డాగ్ హ్యాండ్లర్ పునశ్చరణ ప్రత్యేక శిక్షణలో జిల్లాకు చెందిన పోలీసు జాగిలం బ్యూటీ ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి 35 జాగిలాలు, 54 మంది డాగ్ హ్యాండ్లర్స్ పాల్గొన్నారు. మన జిల్లా నుంచి ఎక్స్‌ప్లోజివ్ శిక్షణలో బ్యూటీ పాల్గొని ద్వితీయ స్థానం సాధించగా నార్కోటిక్ శిక్షణలో రాణి పాల్గొంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఉదయం పోలీస్ డాగ్స్‌తో కలిసి డాగ్ హ్యాండ్లర్స్ జిల్లా ఎస్పీ రాధికను మర్యాదపూర్వకంగా కలవగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ నేర పరిశోధనకు, నియంత్రణకు, తీవ్రవాద చర్యలను సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన శిక్షణ జాగిలాలకు ఇవ్వడం సంతోషకరమని, జాగిలాల సేవలను సమర్థంగా వినియోగించుకుని జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, రుషి, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మిక శోభ..!



పిఠాపూర్ ధకులై మాత రుద్రాణి అలంకారం



వైష్ణవి స్వరూపంలో ఝుంజరీ మంగళామాత

షోడష దినాత్మక పూజలు పురస్కరించుకొని శక్తి పీఠాలు, అమ్మవారి ఆలయాల పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ అలముకుంది. ఆరాధ్య దేవతలను వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. నిత్య నూతన శోభతో అమ్మవారి దర్శనం లభించడం భక్తులు అపురూపంగా భావిస్తున్నారు. 16 రోజుల ప్రత్యేక పూజాదుల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం పలు చోట్ల వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం లభించింది. – భువనేశ్వర్



త్రిపుర భైరవి రూపంలో చార నారాయణి అమ్మవారి దర్శనం



ఉగ్రతార అలంకరణలో చవులియాగంజ్ జయ దుర్గామాత



కటక్ చండీమాత రాజరాజేశ్వరి అలంకరణ



గొడొ చండీమాత భువనేశ్వరి అలంకారం



కమల స్వరూపిణిగా వాసంతి దుర్గ అమ్మవారు

నీలమణి దుర్గ ఉత్సవాలకు వేళాయె

- 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- దసరా రోజు వాహనాలకు ప్రత్యేక పూజలు

పాతపట్నం:



నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం

ఆంధ్రా ఒడిశా సరిహద్దులో పాతపట్నంలో వెలసిన నీలమణి దుర్గమ్మ ఉత్సవాలకు వేళయ్యింది. అమ్మవారిని జిల్లా వాసులతో పాటు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు కొలుస్తుంటారు. ఈ నెల 15వ నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి.


400 ఏళ్ల చరిత్ర

అమ్మవారి ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో ఈ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంగా ఉండేది. ఒడిశా పర్లాకిమిడిలో ఉన్న మహారాజులు పరిపాలన కోసం ఈ ప్రాంతం, టెక్కలిలో ఉన్న కోటకు వెళ్లేవారని చెబుతుంటారు. 1674 పర్లాకిమిడిని పరిపాలిస్తున్న గజపతి మహారాజుకు చెందిన కూలీలు పొలం దుక్కి చేస్తుండగా అమ్మవారి విగ్రహం దొరికింది. అనంతరం అమ్మవారు మహారాజు కలలో కనిపించి ఆలయాన్ని నిర్మించాలని సూచించడంతో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ప్రతీతి.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఈ నెల 15వ నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు కుంకుమపూజ, కలశపూజ, అష్టోత్తర శతనామపూజలు, హోమాలు జరుగుతాయని, సాయంత్రం 3 గంటలకు సహస్ర నామ పూజ, కుంకుమ పూజ ఉంటాయని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 15వ తేదీ ఉదయం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. శరన్నవరాత్రుల్లో ఒక్కో రోజు ఒక్కో అవతారంలో అమ్మవారు దర్శనమిస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



పాతపట్నం నీలమణి దుర్గ దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఒక క్రమ పద్ధతిలో ఆలయంలోనికి పంపడానికి ఏర్పాట్లు చేశాం. పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు కోసం పాతపట్నం, మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు విధులు అందించనున్నారు.

– నూలు ఈశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్

అప్పు తీరుద్దామని వెళ్తే..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ యూనియన్ బ్యాంకు వద్ద శుక్రవారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీకి చెందిన మ న్మధరావు అనే వ్యక్తి మధ్యాహ్నం ఒంటిగంటన్నర ప్రాంతంలో యూనియన్ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగా రం విడిపించేందుకు డబ్బు పట్టుకుని వెళ్లాడు. తీసు కెళ్లిన డబ్బులో కొంత మొత్తాన్ని తీసుకుని మిగతా నగదును బండి డిక్కీలో పెట్టి తాళం తీయడం మర్చిపోయినట్లు బాధితుడు తెలిపాడు. బ్యాంకు లోపలకు వెళ్లి డ బ్బులు కట్టేసి తిరిగి వచ్చి చూసేసరికి డిక్కీలో ఉన్న నగ దు మాయమైనట్లు గుర్తించి లబోదిబోమన్నాడు. స్కూ టీ డిక్కీలో ఉన్న రూ.లక్షా పదివేల నగదు, విలువైన పత్రాలను దొంగలు చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశా డు. దీనిపై కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలించారు.

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని వాహనంపై వచ్చి దొంగతనం చేసి పరారైనట్లు ఆస్పత్రి స్టాఫ్ పోలీసులకు తెలిపారు. చోరీ సంఘటన వాస్తవమేనని బ్యాంకుతో పాటు ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో సీసీ ఫుటేజీని పరిశీలించామని నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వీఆర్‌ఓ ఎంపిక

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు గ్రామానికి చెందిన మువ్వల శ్రీకాంత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. వజ్రపుకొత్తూరు మండల పరిధిలో గల నగరంపల్లి గ్రామ సచివాలయంలో ఈయన వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించి ఈ నెల 16 నుంచి 20 వరకు (ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్) ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. శ్రీకాంత్ నేషనల్ స్థాయి గేమ్స్‌కు ఎంపిక కావడంపై పీఎస్‌ఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, ఆర్‌ఐ పవిత్ర సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

సెంచూరియన్‌లో టెలిమెడిసిన్ సేవలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో టెలిమెడిసిన్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యా యి. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల టెలిమెడిసిన్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెలిమెడిసిన్ సేవలతో పేదలకు పెద్ద ఎత్తున ఆరోగ్య పరీక్షలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. సమర్థవంతంగా కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ ప్రొఫెసర్ ఆచార్యులు, సన్నీడియోల్, రమణారావు, డాక్టర్ చైతన్య, ప్రొఫెసర్ శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

కె.కోటపాడు: మండలంలోని డి.అగ్రహారం శివారులోని మామిడితోటలో విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన నర్సింగపల్లి బొమ్మయ్య(80) అనే వృద్ధుడు మృతిచెందాడు. మామిడితోట పరిసరాల్లో తీవ్ర దుర్వాసన రావడంతో అటువైపుగా వెళ్లి చూసిన స్థానికులు.. వృద్ధుడి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. ఈ సమాచారాన్ని ఎ.కోడూరు పోలీసులకు తెయజేశారు. ఎస్‌ఐ బి.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. డి.అగ్రహారం సమీప గ్రామానికి చెందిన విజయనగరం జిల్లాల్లోని కుమ్మపల్లి గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన బొమ్మయ్యగా గుర్తుపట్టారు. భార్య, కుమారుడు చనిపోవడంతో ఇంటి వద్ద బొమ్మయ్య ఒక్కడే ఉంటున్నారు. ఈ నెల 5 వరకూ గ్రామంలో ఉన్న ఆయన తరువాత కనిపించలేదని పోలీసులకు తెలిపారు. బొమ్మయ్య సుమారు 5 రోజుల కిందటే మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు.

తిప్పలవలస మత్స్యకారుడు అదృశ్యం

పూసపాటిరేగ: బతుకు తెరువుకోసం కొంత కాలం క్రితం పొరుగు రాష్ట్రం గుజరాత్‌కు చేపల వేట నిమిత్తం వెళ్లిన పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన రాయితి అప్పోడు (35) గుజరాత్ రాష్ట్రానికి బతుకుతెరువు నిమిత్తం తండ్రి అప్పన్నతో కలిసి వెళ్లాడు. గుజరాత్‌లో పది రోజుల క్రితం వేట ముగించుకుని ఒడ్డుకు చేరిన అప్పోడు తరువాత నుంచి కనిపించక పోవడంతో అక్కడి వారు తిప్పలవలసలో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కుమారుడి అచూకీ తెలిసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

లింగనిర్ధారణ వెల్లడిస్తే కఠిన చర్యలు

విజయనగరం ఫోర్ట్: గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు తమ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌లను విధిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడి నియామకం

విజయనగరం టౌన్: భారతీయ జనతాపార్టీ యువమోర్చా విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా పిల్లా నవీన్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం బాధ్యతలు అప్పగించారు. కొన్నేళ్లుగా పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తున్న తనను గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందని నవీన్‌కుమార్ ఈ సందర్భంగా అన్నారు. అంకిత భావంతో పనిచేస్తూ ప్రజల పక్షాన నిలబడి పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

డైలాగ్‌కింగ్‌కు జ్ఞాన సరస్వతి విశిష్ట పురస్కారం

విజయనగరం టౌన్: ప్రముఖ చలనచిత్ర నటుడు, డైలాగ్ కింగ్, డబ్బింగ్ ఆర్టిస్ట్, సుపరిచిత దూరదర్శన్ వ్యాఖ్యాత పూడిపెద్ది సాయికుమార్‌కు శ్రీ జ్ఞానసరస్వతి విశిష్ట పురస్కారం అందజేయనున్నట్లు శారదా సేవా సంఘం అధ్యక్ష్య, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ఆవరణలో వేదపండితులు, కమిటీ సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 29న ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఆలయం ఆవరణలో వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో అతిథుల సమక్షంలో సాయికుమార్‌ను ఘనంగా సత్కరించనున్నామని తెలిపారు. అదేవిధంగా 19వ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆలయంలో నిర్వహిస్తున్నామన్నారు. 15నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 20న శుక్రవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తామని వివరించారు. భక్తులందరూ జ్ఞానసరస్వతి అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

- ప్రతి ఇంటికీ గిరిజన పంట
- తక్కువ ధరలకే గిరిజన ఉత్పత్తులు లభ్యం
- జీసీసీ ఆధ్వర్యంలో ఆయుష్షును పెంచే ఆరోగ్యకర ఉత్పత్తుల విక్రయం
- వీడీవీకే, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రాసెసింగ్
- ట్రైఫెడ్ సహకారంతో మార్కెటింగ్‌కు ప్రణాళికలు
- తొలుతగా సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలో స్టాల్స్ ఏర్పాటు
- జీసీసీకి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం
- రూ.కోట్లలో టర్నోవర్ చేయడమే లక్ష్యం

కొండంత అండ

కొండకోనల్లో సేంద్రియ పద్ధతుల్లో గిరిజనులు పండించే ఆరోగ్యకర పంటలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయి. ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుతున్నాయి. ప్రభుత్వ తోడ్పాటుతో నాణ్యమైన గిరిజన ఉత్పత్తులను వినియోగదారులకు తక్కువ ధరకే అందించే బృహత్తర క్రతువును జీసీసీ భుజానకెత్తుకుంది. ట్రైఫెడ్ సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఓ వైపు గిరిజన రైతులకు, మరోవైపు వినియోగదారులకు లబ్ధిచేకూర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. గిరిజన ఉత్పత్తుల ప్రాసెసింగ్, విక్రయాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలకు 'సాక్షి' అక్షరరూపం.



విజయనగరం డెస్క్:

గిరిజన రైతులు సేంద్రియ, ప్రకృతి సాగు పద్ధతుల్లోనే పంటలు పండిస్తారు. చిరుధాన్యాల నుంచి ఉద్యానవనాల వరకు రసాయనిక ఎరువులకు దూరంగా 'సాగు' తున్న రైతులకు జీసీసీ వెన్నుదన్నుగా నిలుస్తోంది. గిరిజనుల నుంచి సేకరించిన నాణ్యమైన, ఆరోగ్యకర ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తోంది. గిరిజన ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుండడంతో ట్రైఫెడ్ సహకారంతో మార్కెటింగ్ ప్రణాళికలను రచిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోనే తొలుతగా సీతంపేటలో ఇటీవల గిరిజన ఉత్పత్తుల మేళాను నిర్వహించింది. సీజనల్‌గా లభించే పంటలను పొదుపుసంఘాల మహిళల సహకారంతో ప్రతి ఇంటికీ తక్కువ ధరకే చేర్చుతోంది. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుండడంతో ఇటు గిరిజన రైతులకు దళారుల బెడదలేకుండా ఓ రూపాయి ఆదాయం సమకూరుతుండగా, అటు వినియోగదారులకు ఓ రూపాయి తక్కువ ధరకే ఆరోగ్యకర ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ఏజెన్సీలో లభించే గిరిజన ఉత్పత్తులు ఇలా..

చింతపండు, పసుపు, కుంకుడుకాయలు, నల్లజీడి పిక్కలు, నరమామిడిచెక్క సీతాఫలాలు, కొండచీపుళ్లు, జీడిపిక్కలు, ఎండు ఉసిరిపప్పు, ముషిడిక పిక్కలు, తానికాయలు, తేనె, రాగులు, కొర్రలు, జొన్నలు, వరి, సీతాఫలాలు, పైనాపిల్, నిమ్మ, రామబలం, దబ్బ పండ్లు. కాఫీఆకు తదితరవి.

ప్రాసెసింగ్ ఇలా..

గిరిజన రైతులు ఉత్పత్తిచేసే పంటలకు తొలుత జీసీసీ మద్దతు ధర ప్రకటిస్తుంది. ఆ మేరకు కొనుగోలుచేసి వీడీవీకే (వన్‌ధన్ వికాస్ కేంద్రాలు), గిరిజన ఉత్పత్తి సహకార సంఘాలకు సరఫరా చేస్తుంది. అక్కడ సహజ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయిస్తుంది. ఆకర్షించే ప్యాకింగ్ చేయించి మార్కెటింగ్ చేస్తుంది. దీనివల్ల పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని వేలాదిమంది గిరిజనులకు ఉపాధి కలుగుతోంది.

విరివిగా స్టాల్స్...

గిరిజన ఉత్పత్తులు నాణ్యమైనవి కావడం, అమ్మకాలకు ప్రభుత్వం సహకరించడంతో జీసీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యకూడళ్లలో గిరిజన మహిళలు, పొదుపుసంఘాల సభ్యులతో స్టాల్స్ ఏర్పాటుచేయిస్తోంది. ప్రజలకు ఆరోగ్యకర ఉత్పత్తులను చేరవ చేస్తోంది. శ్రీవారి సేవకు జీసీసీ నుంచి తేనె పెద్ద ఎత్తున సరఫరా అవుతోంది. ఆయుర్వేద మందులను సైతం మార్కెటింగ్ చేస్తోంది.





మార్కెటింగ్ చేసే ఉత్పత్తులు

పసుపుపొడి, కారంపొడి, రాగులు, కొర్రలు పిండి, దంపుడు బియ్యం, శీకాయ పొడి, కుంకుడు కాయలు, కుంకుడుకాయ షాంపూ, నన్నారి షరాబత్, సబ్బులు, తెనె, త్రిఫల డ్రింక్స్, జాస్మిన్‌లోషన్, కుంకుమ పౌడర్, అరకు కాఫీపొడి, రాజ్‌మారెడ్‌స్మాల్, హెర్బల్‌పెయిన్ రిలీఫ్ ఆయిల్, గిరిగోల్డ్‌బ్లాక్ పెప్పెర్, మారేడు బామ్, వివిధ రకాల హస్తకళావస్తువులు, తదితరవి.



పార్వతీపురం మన్యం జిల్లాలో జీసీసీ పరిధిలో గిరిజన ఉత్పత్తుల అమ్మకం ఇలా..

2020-21	రూ.74లక్షలు
2021-22	రూ.28 లక్షలు
2022-23	రూ.1.49కోట్లు
2023-24	రూ.15లక్షలు (నేటివరకు)

జీసీసీ ఉత్పత్తులకోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్:
83339 10193
ఆన్‌లైన్ వెబ్‌సైట్:
డబ్లుడబ్లుడబ్లు.ఏపీగిరిజన.కామ్

గిరిజన రైతులకు జీసీసీ చెల్లిస్తున్న మద్దతు ధరలు ఇలా..

రకం	ధర (రూపాయల్లో)
తేనెమైనము	160
తేనెరాక్‌బీ	200
ఎపేరి తెనె	150
పిక్కతో చింతపండు	32.40
పిక్కతీసిన పండు	63
చింత పిక్కలు	10
ఇండుగ పిక్కలు	50
ముషిడిక పిక్కలు	60
మారేడు గడ్డలు	500
విప్పపప్పు	29
కాగుపప్పు	22
కరక్కాయలు	18
గచ్చకాయలు	45
నరమామిడి చెక్క	18
కొండచీపురు	45
శీకాయ	50
కుంకుడుకాయలు	60
ఎండు ఉసిరిపప్పు	90
తానికాయలు	15
నల్లజీడిపిక్కలు	18

ఆరోగ్యానికి మేలు



జీసీసీ విక్రయించే వివిధ రకాల వస్తువులను గత నాలుగేళ్లుగా వినియోగిస్తున్నాను. అలోవేరా సబ్బులు, కుంకుడుకాయ, శీకాయ షాంపూలు కుటుంబమంతా వినియోగిస్తున్నాం. తేనె వాడుతున్నాను. త్రిఫల డ్రింక్ కూడా ఆరోగ్యానికి ఉపయోగపడుతోంది. గిరిజన ఉత్పత్తులు నాణ్యమైనవి.

– ఎస్.రవికుమార్, కడగండివలస, సీతంపేట

గిరిజనులకు అన్ని విధాలా సహకారం



గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నాం. కొన్ని రకాల ఉత్పత్తులపై గతంలో కంటే రెండింతలు మద్దతుధరలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన ఉత్పత్తులను, ఉప ఉత్పత్తులుగా తయారు చేసి జీసీసీ విక్రయిస్తోంది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

గిరిజనులకు ఆర్థిక ఊతం



స్వచ్ఛమైన ముడిసరుకులతో ప్రజారోగ్యానికి ఎటువంటి హాని కలిగించని ఉత్పత్తులను జీసీఎంఎస్ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నాం. ఆరోగ్యానికి మేలు చేసే ఆయుర్వేద ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నాం. ప్రకృతి సిద్ధమైన గిరిజన ఉత్పత్తులు దళారుల పాలవకుండా మైదాన ప్రాంతాల ప్రజలకు చేరువచేసే చర్యలను జీసీఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టాం. రానున్న రోజుల్లో గిరిజన ఉత్పత్తులను ప్రజలందరికీ చేరువచేసే ప్రణాళిక సిద్ధం చేశాం. గిరిజనులకు ఆర్థిక ఊతం కల్పిస్తాం. ముడిసరుకులకు మద్దతు ధర కల్పిస్తాం.

– జి.సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, జీసీసీ

ప్రతి గ్రామానికి చేరువ చేస్తున్నాం



జీసీఎంఎస్‌కు మరింత ఆదాయం చేకూరేలా ఉత్పత్తులను గ్రామ స్థాయి ప్రజలకు అందించేందుకు మొబైల్ సేవలను ప్రారంభించాం. ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులతో మాట్లాడి స్టాల్స్ ఏర్పాటు చేశాం. దీనివల్ల గిరిజనులు లబ్ధి పొందడమే కాకుండా ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి గ్రామానికి జీసీఎంఎస్ ఉత్పత్తులు సరఫరా అయ్యేలా మొబైల్ సేవలను విస్తృతం చేస్తాం. దళారులచేతిలో గిరిజనులు మోసపోకుండా డిపోల ద్వారా ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేసి ఆర్థికంగా అండగా నిలుస్తున్నాం.

– మహేంద్ర కుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం మన్యం

అమృత్ భారత్‌కు చీపురుపల్లి రైల్వేస్టేషన్ ఎంపిక

- రూ.14 కోట్లతో ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌కు రెండో వైపు ప్రవేశద్వారం
- డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో చీపురుపల్లి రైల్వేస్టేషన్ ఎంపికైందని ఈ పథకం ద్వారా రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విశాఖపట్నం నుంచి ప్రత్యేక రైలులో చీపురుపల్లి వచ్చి రైల్వే స్టేషన్ పరిసరాలు, ఇక్కడున్న సౌకర్యాలు, ప్రస్తుతం ఉన్న సదుపాయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అమృత్ భారత్ పథకం ద్వారా రైల్వేస్టేషన్ అభివృద్ధికి సంబంధించి రైల్వే ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేసిన ప్లాన్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం ద్వారా రూ.14 కోట్లు నిధులు వెచ్చించి రైల్వేస్టేషన్ ఆధునికీకరించనున్నట్లు వెల్లడించారు. విజయదశమి, దీపావళి పండగల నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆ రెండు పండగలు పూర్తయ్యాక పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో వాహన పార్కింగ్ సదుపాయం, ముఖద్వారం ఆధునికీకరణ, ఇతర సదుపాయాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి రెండు వైపులా అనుసంధానం చేయనున్నామని తెలిపారు.



అమృత్ భారత్ పథకంలో రూ.14 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించిన ప్లాన్ పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

పెరగనున్న ప్లాట్‌ఫాంలు

అంతేకాకుండా విజయనగరం నుంచి భువనేశ్వర్ వరకు నాల్గవ లైన్ ఏర్పడడం ద్వారా ఇప్పుడున్న ప్లాట్‌ఫాంలు పెరగనున్నట్లు చెప్పారు. అలాగే ఇంతవరకు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌కు ఒక వైపు మాత్రమే ప్రవేశ ద్వారం ఉందని తాజాగా జరగనున్న అధునికీకరణలో రెండో వైపు కూడా ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎంతోకాలంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ డిమాండ్ ప్రయాణికుల నుంచి ఉందన్న విషయాన్ని స్థానిక విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ ప్రతిపాదన ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులకు పంపించామని త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఆర్‌ఎం ఏకే.గుప్త ఉన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందులూ శుక్రవారం మృతిచెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని వసంతల వీధికి చెందిన మడక సంతోష్(30) మద్యానికి బానిసయ్యాడు.ఈ క్రమంలో మద్యం తాగేందుకు కుటుంబసభ్యలను డబ్బులు అడగగా వారు లేవు అనడంతో మనస్తాపానికి గురై ఈ నెల 11వ తేదీన గడ్డి మందు తాగాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు సంతోష్‌కు బాడంగి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్టలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలిండియా ఖోఖో పోటీలకు జిల్లా పీడీలు

- ఈనెల 16 నుంచి న్యూఢిల్లీలో పోటీలు



ఎస్.విజయలక్ష్మి | జి.ఆదిలక్ష్మి | ఎస్.కనకమహాలక్ష్మి

విజయనగరం: న్యూఢిల్లీలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల ఖోఖో పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరగబోయే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో మొదటిసారిగా ఖోఖో పోటీలు నిర్వహిస్తుండగా..రాష్ట్ర జట్టులోకి కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్.విజయలక్ష్మి, పెదతాడివాడ వ్యాయామ ఉపాధ్యాయిని జి.ఆదిలక్ష్మి, మెట్టపల్లి వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.కనకమహాలక్ష్మిలు ఎంపికవడం విశేషం. ఆలిండియా పోటీలకు వెళ్తున్న వ్యాయామ ఉపాధ్యాయినులను జిల్లా ఖోఖో, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.


బంగారుతల్లికి ఘనంగా సన్మానం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఆడబిడ్డ రెడ్డి మౌనిక ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచి బంగారుపతకాన్ని సాధించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిందని పలువురు ప్రజాప్రతినిధులు,వక్తలు ప్రశంసించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన అండర్-23 ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి మౌనికను గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఆమె తల్లిదండ్రుల సమక్షంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థినిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మౌనిక, మరిన్ని విజయ పతకాలు సాధించాలని ఆకాంక్షించి మెమొంటో, నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా మౌనికతో పాటు క్రీడల్లో రాణిస్తున్న అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు క్రీడాకారిణులు ప్రవల్లిక, రేణుక, శ్రావణిలను, కోచ్ రామారావును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, బమ్మిడి అప్పలస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, ఎడ్ల అప్పారావు, జీసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అండర్-19 కరాటే పోటీలకు 14 మంది ఎంపిక

విజయనగరం:

రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల కరాటే పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. ఈ మేరకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో గల ఇండోర్ స్టేడియంలో జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు హాజరుకాగా..వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురును జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో పార్వతీపురం-మన్యం జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, పలువురు కరాటే కోచ్‌లు పర్యవేక్షించారు.



కరాటే పోటీల్లో ఎంపికైన క్రీడాకారులతో సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్

15న జూడో క్రీడాకారుల ఎంపిక

అండర్-19 స్కూల్ గేమ్స్ జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీవీఎల్ఎస్ కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రామభద్రపురం మండలం కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 19 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి 8, 9,10, ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఫలితమిస్తున్న అవగాహన

- తగ్గుదల కనిపిస్తున్న హెచ్‌ఐవీ ఎయిడ్స్



హెచ్‌ఐవీ రోగులకు మందులు అందజేసే ఏఆర్‌టీ సెంటర్

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ-ఎయిడ్స్ ఎవరికైనా సోకిందని తెలిస్తే ఆ వ్యాధి సోకిన వ్యక్తి ఇంటికి గాని, ఆ ఛాయలకు గాని జనం వెళ్లే వారు. అంతేకాకుండా కనీసం ఆవ్యక్తితో మాట్లాడడానికి, పక్కన కూర్చోవడానికి ఇష్టపడేవారు కాదు. ఒకప్పుడు ఆ వ్యాధి వ్యాప్తి తీవ్రస్థాయిలో ఉండేది. హెచ్‌ఐవీపై అవగాహన లేక చాలా మంది దాని బారిన పడేవారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయడం, అవగాహన కల్పించడం కారణంగా వ్యాధి వ్యాప్తి క్రమేణా తగ్గుతోంది. గతంలో హెచ్‌ఐవీ పరీక్ష చేసుకోవడానికి ముందుకు వచ్చే వారు కాదు. ఇప్పుడు స్వచ్ఛందంగా చాలామంది ముందుకు వస్తున్నారు.

'జిల్లాలో నమోదైన కేసులిలా..

సంవత్సరం	పరీక్షలు	పాజిటివ్ కేసులు
2020-21	41,943	329
2021-22	73,916	403
2022-23	90,231	495
2023-24	43,781238	(సెప్టెంబర్ వరకు)

జిల్లాలో చికిత్స సౌకర్యాలు ఇవి

విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఏఆర్‌టీ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 8 లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, 83 ఐసీటీసీ కేంద్రాలు, 10 రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. హెచ్‌ఐవీ బాధితుల సంక్షేమం కోసం 6 స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి.

జిల్లాలో హెచ్‌ఐవీ కేసుల వివరాలు:

జిల్లాలో హెచ్‌ఐవీ రోగులు 15,009 మంది నమోదయ్యారు. వారిలో పురుషులు, 7,338, మహిళలు 7,097, పిల్లలు 574 మంది ఉన్నారు. ఏఆర్‌టీ కేంద్రంలో 13,330 మంది రిజిస్టర్ అయ్యారు. ఏఆర్‌టీ కేంద్రంలో ప్రస్తుతం మందులు వాడుతున్న వారు 7,816 మంది ఉన్నారు.

పెరిగిన అవగాహన

హెచ్‌ఐవీపై విస్తృతంగా అవగాహన కల్పిస్తుండడంతో వ్యాప్తి తగ్గుతోంది. ప్రజల్లో కూడా గతంలో కంటే అవగాహన బాగా పెరిగింది.

– డాక్టర్ సూర్యనారాయణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి